సావిత్రమ్మకు మండలి చైర్మన్ గుత్తా నివాళి

చిట్యాల మండలం శామబావితోట(వట్టిమర్తి)కు చెందిన నర్రా సావిత్రమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

శివగంగ పంచమ బ్రహ్మోత్సవాలకు రండి

- ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఆహ్వానం

ఎమ్మెల్యే సామేల్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్నయాదవులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 23 : ఈ నెల 25నుంచి 27వరకు జరిగే శివ గంగ పంచమ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుకు అడ్డగూడూరు మండలం ధర్మారంలోని ఆయన నివాసంలో యాదవులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 25న గంగతెప్ప ఊరేగింపు, గంపల ప్రదర్శన, 26న శివగంగ కల్యాణం, మధ్యాహ్నం బోనాల సమర్పణ, 27న ఆకుమంచమ్మ బోనం సమర్పణతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

- ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 23 : మండల ప్రజలు ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఉపాధి హామీ పని దినాలు పెంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ మోసిన్ అలీ, టీఏ రాధ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, శోభన్‌బాబు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, పుష్పార్చన, హోమం, పాలాభిషేకాలు నిర్వహించారు. చుట్టపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అగ్నిగుండంలో నడిచారు. అనంతరం భక్తులు, గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ఎల్లమ్మకు సమర్పించారు. మూడ్రోజులపాటు జరిగిన వేడుకలు శుక్రవారం ముగిశాయి.

నేడు సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం

మిర్యాలగూడరూరల్, ఫిబ్రవరి 23 : మండలంలోని చిల్లాపురంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ సాతునూరి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మిర్యాలగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి మూడ్రోజులపాటు ఉత్సవాలు ఉంటాయన్నారు. 24న వివిధ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 25న విఘ్నేశ్వర పూజ, అభిషేకం, స్వామివార్ల విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. 26న అనుముల వెంకటేశ్వరశర్మ, శరత్‌కుమార్‌శర్మతో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సమావేశంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పాతునూరి అంజయ్య, ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన, సహాయ కార్యదర్శులు జానపాటి శ్రీను, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మల్లికంటి రేణూబాయి, రామలింగయ్య, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘గృహజ్యోతికి వివరాలు అందజేయాలి’

మునుగోడు, ఫిబ్రవరి 23 : గృహజ్యోతి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని విద్యుత్ శాఖ ఏడీ నాగేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రతి ఇంటికి తిరిగి వినియోగదారుల నుంచి వివరాలు సేకరించాలన్నారు. ప్రజలు తమ ఆధార్, రేషన్, ఫోన్ నంబర్లను విద్యుత్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. సమావేశంలో మునుగోడు, చండూరు, గట్టుప్పుల్ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఉద్యోగి ఆత్మహత్య

తిప్పర్తి, ఫిబ్రవరి 23 : ఉరేసుకొని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డికొండారం గ్రామానికి చెందిన కస్పరాజు నవీన్ (25)మండల కేంద్రంలోని మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం విధులకు హాజరయ్యాడు. ట్యాంక్ మెట్లకు ఉన్న పిల్లర్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, చిన్న బాబు ఉన్నాడు. కాగా, నవీన్ చాలీచాలని వేతనంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐటీయూ కార్యదర్శి గణేశ్ ఆరోపించారు. మిషన్ భగీరథ కార్మికులతో కలిసి ప్లాంట్ వద్ద నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మంచినీళ్లు మహాప్రభో..!

- పీఏపల్లి పునరావాస కేంద్రం ఎస్సీ కాలనీలో మరమ్మతులకు గురైన గేట్‌వాల్
- వారం రోజులుగా నీటి సరఫరా బంద్

మరమ్మతులకు గురైన గేట్‌వాల్



పీఏపల్లిలో ట్యాంకు వద్దకు వచ్చి నీళ్ల పట్టుకుంటున్న కాలనీవాసులు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 23 : మంచి నీటి ట్యాంక్ గేట్‌వాల్ మరమ్మతులకు గురవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పీఏపల్లి పునరావాస కేంద్రం ఎస్సీ కాలనీలో వారం రోజులగా నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో ఎస్సీ, బీసీ కాలనీల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. గేట్‌వాల్ మరమ్మతులకు వారం రోజులు పడుతుందా? అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో తమ గోడు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. కనీసం గ్రామపంచాయతీ ట్యాంకర్‌తోనైనా నీటిని సరఫరా చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ప్రత్యేక అధికారి ఎంపీడీఓను వివరణ కోరగా వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్న విషయం తమ దృష్టికి రాలేదని పేర్కొనడం గమనార్హం.

25న కబడ్డీ క్రీడాకారుల జిల్లా జట్టు ఎంపిక

హాలియా, ఫిబ్రవరి 23 : ఈ నెల 25న హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో సీనియర్ కబడ్డీ క్రీడాకారుల జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని, తమ ఆధార్ కార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రేషన్ కార్డు ఈ-కేవైసీ చేయించుకోవాలి

- డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్

చందంపేట, ఫిబ్రవరి 23 : రేషన్ కార్డులో పేరు ఉన్నవారు ఆఫ్‌లైన్‌లో ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని దేవరకొండ డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 లోగా మండల మండల ప్రజలు వంద శాతం కేవైసీ చేసుకునేలా రేషన్ డీలర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. చందంపేట మండలంలోని 12, నేరేడుగొమ్ము మండలంలో 2 ఆఫ్‌లైన్ రేషన్ దుకాణాలు ఉన్నందున ఆ యా రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

గంజాయి కేసులో మూడేండ్లు జైలు

నల్లగొండ, ఫిబ్రవరి 23 : గంజాయి కేసులో తూర్పుగోదావరి జిల్లా పెద్దపూడి గ్రామానికి చెందిన నందం సరేశ్‌రెడ్డికి మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమాన విధించినట్లు మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి బి.తిరుపతి వెల్లడించారు. నల్లగొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్‌లో నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో గల శివశంకర్ పెట్రోల్ బంక్ పక్కన నందం సురేశ్ గంజాయి అమ్ముతుండగా ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి 1.905 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కేసు విచారణ పూర్తయిన పిదప సబ్ ఇన్‌స్పెక్టర్ రోజా కోర్టులో చార్జ్‌షీట్ వేయగా శుక్రవారం తుది తీర్పు వచ్చినట్లు తెలిపారు

సీనియర్ అధికారుల సూచనలు పాటించాలి

- డీపీఓ పాల్వాయి శ్రవణ్‌కుమార్

నకిరేకల్, ఫిబ్రవరి 23 : ప్రతి ఒక్కరూ సీనియర్ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. నకిరేకల్‌లో చీమలగడ్డ రైతు వేదికలో సూర్యాపేటకు బదిలీపై వెళ్లున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ప్రస్తుత ఏడీఏ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నకిరేకల్ డివిజన్‌లోని వ్యవసాయ శాఖ అధికారులు, ఏడీఏ శ్రీధర్‌రెడ్డితో ఉన్న ఉద్యోగ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం నకిరేకల్ నుంచి బదిలీపై వెళ్తున్న శ్రీధర్‌రెడ్డి, ఏఓ మల్లేశ్‌ను, కట్టంగూర్ నుంచి బదిలీపై వెళ్లిన ఏఓ శ్రీనివాసులను సన్మానించారు. కార్యక్రమంలో నల్లగొండ ఏడీఏ హుస్సేన్ బాబు, వ్యవసాయ అధికారులు జానీమియా, పురుషోత్తం, గిరిప్రసాద్, సన్నిరాజు, సౌమ్య, శృతి, ఏఈఓలు పాల్గొన్నారు.

నేడు వజ్రతేజలో విశ్వంభర సినిమా షూటింగ్

హాలియా, ఫిబ్రవరి 23 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పాలెం స్టేజీ సమీపంలో ఉన్న వజ్రతేజ రైస్‌మిల్లులో శనివారం విశ్వంభర సినిమా షూటింగ్ నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా, ఈ సినిమాలో చిరంజీవి హీరోగా నటిస్తున్నారు. షూటింగ్‌లో చిరంజీవితోపాటు రాజా రవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్‌చంద్రతోపాటు ఇతర ఆర్టిస్టులు పాల్గొననున్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి ధ్వజారోహణం

గోపలాయపల్లి గుట్టపై ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23 : గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి ధ్వజారోహణం, గరుడ ముద్ద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నేడు స్వామివారి కల్యాణం జరుగనున్నది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని రావాల్సిందిగా ఆలయ అనువంశిక చైర్మన్ కోమటి రెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- డీఆర్‌డీఓ నాగిరెడ్డి

ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ నాగిరెడ్డి

నాంపల్లి, ఫిబ్రవరి 23 : ఉపాధి హామీ పనుల్లో అధికారులు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ నాగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని జరిగిన పనులపై సీఆర్‌పీలు ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై నివేదికలు సమర్పించారు. అనంతరం గ్రామాల వారీగా జరిగిన పనులపై పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథకం సిబ్బందితో డీఆర్‌డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయా గ్రామాల అధికారుల పనీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని, కూలీలకు పేస్లిప్‌లు అందజేయాలన్నారు. పనులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత, అడిషనల్ పీడీ నవీన్, ఎంపీడీఓ మెరి, శేషుకుమార్, ఏపీఓ ఇర్మియ పాల్గొన్నారు.

గుండె జబ్బు బాధితుడి ఆరోపణలు అవాస్తవం

- రివర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవీందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23 : పట్టణంలోని రివర్ ఆస్పత్రిపై గుండె జబ్బు బాధితుడు ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రవీణ్‌కుమార్‌కు చేసిన యాంజియోగ్రామ్ స్టంట్ల వివరాలను వీడియోగ్రఫీ ద్వారా వివరించారు. ప్రవీణ్‌కుమార్ గుండెలోని ఎల్‌ఏడీ నాళం పూర్తిగా దెబ్బతిన్నదని, దానికి స్టంట్ వేయడం సాధ్యపడదని తెలిపారు. మిగతా రెండు రక్తనాళాలకు నాలుగు స్టంట్లు వేశామన్నారు. పూర్తి వైద్య నిబంధనలు పాటించి డాక్టర్ సంపత్‌కుమార్ ఆపరేషన్ చేశారని తెలిపారు. ప్రవీణ్‌కుమార్ వైద్యానికి సంబంధించి పూర్తి నివేదికలు తమ ఆస్పత్రిలో ఉన్నాయన్నారు. అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సదుద్దేశంతో ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారావు

క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారావు

నాంపల్లి, ఫిబ్రవరి 23 : యువత క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు అన్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కేజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు క్రీడా కిట్లను అందజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని పకీర్‌పురం, కేతేపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో యువకులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అందుగుల కవిత, అందుగుల యాదయ్య, ఎండీ సలీం, కాశిమల్ల జంగయ్య, ముదిగొండ యాదయ్య పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు అంకితభావంతో పని చేయాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఫిబ్రవరి 23 : లక్ష్య సాధనకు అంకితభావంతో కృషి చేయాలని, ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల లక్ష్యంతోపాటు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన పదో తరగతి ప్రేరణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తన బలాన్ని బలహీనతలను విశ్లేషణ చేసుకోవాలని, పరీక్షల్లో మంచి మార్కులు ఎలా సాధించాలో ఆలోచించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యంతోపాటు సబ్జెక్టు విషయాన్ని సైతం అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇందుకు ఏ విషయంలో వెనుకబడి ఉన్నారో దానిపై దృష్టి సారించి ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను పరస్పరం చర్చించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ, ఇన్‌చార్జి డీటీడబ్ల్యూఓ రాజ్‌కుమార్, ఏటీడబ్ల్యూఓ లక్ష్మిరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి రామకృష్ణ, ప్రిన్సిపాల్ హనుమాక్షి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, ఫిబ్రవరి 23: ప్రజా సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో హెచ్చరించారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం, నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది సమన్వయంతో పట్టణంలోని ధన లక్ష్మి రైస్‌మిల్ ఎదురుగా దోసపాటి వేణు తండ్రి నర్సయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు నిఘా పెట్టి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి విస్తృత స్థాయిలో దాడులు చేస్తున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలి

- జీవీఎం ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 23 : బాలికలు, మహిళలు తమ ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. తైక్వాండో అసోసియేషన్ అధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన బెల్ట్ ప్రమోషన్ టెస్టు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బెల్టులు, మెమెంటోలు అందజేసి మాట్లాడారు. తైక్వాండోలో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి పేరు తీసుకురావాలన్నారు. తైక్వాండో కోచింగ్ ఇస్తున్న శిక్షకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ స్పోర్ట్ ఆఫీసర్ మగ్బూల్ అహ్మద్, బీసీ గురుకుల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కత్తుల శంకర్, బీఆర్ఎస్ నాయకుడు యామ దయాకర్, తైక్వాండో చీఫ్ ఎగ్జామినర్ యూనుస్ కమల్, ఆర్గనైజర్, తైక్వాండో కోచ్ ప్రణీత్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

తిరుమలగిరి(సాగర్) : స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 23 : మండలంలోని అల్వాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాపోలు పరమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే వృత్తిపరమైన విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులు, అధికారులుగా విధులు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, పావని, బాలకృష్ణ, విజయలక్ష్మి, లింగమ్మ, వీరయ్య, గౌస్‌బాబా, అరుణకుమారి, నగేశ్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో..

చిట్యాల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రల్లో ప్రతిభ కనబరిచారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీ సభ్యులకు శిక్షణ

మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

నల్లగొండ, ఫిబ్రవరి 23 : పార్లమెంట్ ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీ సభ్యులకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అండ్ మానిటరింగ్ నోడల్ అధికారి, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ మట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ వ్యయ పరిశీలకుల బృందాలు, ఎంసీఎంసీ కమిటీ సభ్యులకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని ఎలా లెక్కించాలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహించడం, నగదు దొరికిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. అంతేకాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయానికి సంబంధించి రిజిస్టర్ల నిర్వహణ, ఇన్‌కమ్, కమర్షియల్ టాక్స్‌లు, కో ఆపరేటివ్, లీడ్ బ్యాంక్, ఎక్సైజ్, ట్రాన్స్కో, పోలీస్, ట్రెజరీ, ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, ఎస్ఐసీ అధికారి గణపతిరావు, ఎంసీఎంసీ సభ్యుడు శేషాచార్యులు, మాస్టర్ ట్రైనర్ పరమేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ : ఎస్ఈ

మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రమోహన్

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 23 : జిల్లాలో విద్యుత్ అంతరాయం లేదని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం విద్యుత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గతం కంటే ప్రస్తుతం గ్రౌండ్ వాటర్ తగ్గడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, అయినా రైతులకు ఇబ్బంది కలుగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 900 మిలియన్ మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు జిల్లాలో 8 సబ్‌స్టేషన్లలో రూ.4కోట్లతో అడిషనల్ కెపాసిటీలను పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా పాలనలో గృహజ్యోతి కోసం 4లక్షల 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 70 శాతం వరకు తెల్ల రేషన్‌కార్డుతో లింక్ చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ కార్యాలయంలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. 9440814326 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో డీఈ వెంకటేశ్వర్లు, టౌన్ ఏడీ శంకరయ్య ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

TO-LET
★హుజూర్ నగర్, మెయిన్ రోడ్ నందు 6 షాపులు రెంటుకు కలవు. ఈ ఫోన్ నెంబర్ నందు సంప్రదించగలరు. సెల్: 8121841370.
NT-311624

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్ల